క్లుప్తంగా

27న పెద్దింటమ్మ వార్షిక కల్యాణం


ఆకివీడు పెద్దింటమ్మ

ఆకివీడు: స్థానిక గ్రామ దేవత పెద్దింటమ్మ వార్షిక కల్యాణోత్సవాలు ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు దేవస్థానం బోర్డు చైర్మన్ బొమ్మారెడ్డి మాధవరెడ్డి శనివారం చెప్పారు. 26వ తేదీ ఉదయం విఘ్నేశ్వరుడి పూజ, అఖండ దీప స్థాపన, త్రిశూల పూజలు, 27న నిత్య పూజలు, లక్ష్మీ గణపతి, సుబ్రహ్మణ్య, దుర్గ,రుద్ర, హోమములు, బలిహరణ, రాత్రి 7 గంటలకు జలదుర్గా సమేత శక్తీశ్వర స్వామి వార్లకు కల్యాణ మహోత్సవం, 28న స్వామి వార్ల త్రిశూల స్నానం, పుష్పోత్సవం, పవళింపు సేవలుంటాయని తెలిపారు.

విద్యుత్ మోటార్ల చోరీపై ఫిర్యాదు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం రొయ్యల చెరువు వద్ద షెడ్డులో 7 విద్యుత్ మోటార్లు అపహరించారంటూ రైతు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం భీమవరం బ్యాంకు కాలనీకి చెందిన కోరం చిన వెంకటేశ్వరరావు కొమరాడలో రొయ్యలు సాగు చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం రొయ్యల చెరువు వద్ద షెడ్డులో ఉంచిన 7 విద్యుత్ మోటార్లు, జనరేటర్లకు సంబంధించిన 2 బ్యాటరీలు గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని రైతు కోరం చిన వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఏఎస్సై ఆకురాతి సూర్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గృహ నిర్మాణాల పరిశీలన


కాళ్లలో గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి కిషోర్ కుమార్

కాళ్ల: గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని కాళ్ల మండల ప్రత్యేకాధికారి కె.కిరణ్ కుమార్ లబ్ధిదారులకు సూచించారు. కాళ్ల జగనన్న కాలనీలో గృహ నిర్మాణ సముదాయాన్ని ఆయన శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.స్వాతి, తహసీల్దార్ కృష్ణారావు, ఎలక్ట్రికల్ ఏఈ రాంబాబు, హౌసింగ్ ఏఈ ఆంజనేయరాజు, సచివాలయం, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

కాళ్లలో వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు


కాళ్లలో ఆవిష్కరణకు సిద్ధంగా ఉన్న వైఎస్సార్ విగ్రహం

కాళ్ల: దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని మండల కేంద్రమైన కాళ్ల గ్రామంలోని లంక రోడ్డుకు వెళ్లే మార్గంలో సొసైటీ అధ్యక్షుడు సుంకర భోగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేశారు. విగ్రహానికి రంగులద్ది ఆవిష్కరణకు సిద్ధం చేశారు. త్వరలో పార్టీ నాయకులకు సమక్షంలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు వైఎస్ విగ్రహాన్ని ఆవిష్కరించానున్నట్టు భోగేశ్వరరావు తెలిపారు.

లెనిన్‌కు ఘన నివాళులు


భీమవరంలో లెనిల్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: కమ్యూనిజమే ప్రపంచ మానవాళికి విముక్తినిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి బి బలరాం అన్నారు. శనివారం రష్యా విప్లవయోధుడు లెనిన్ వర్ధంతి సందర్భంగా మెంటేవారితోటలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనం వద్ద లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బలరాం మాట్లాడుతూ రష్యాలో నిరంకుశమైన జార్ చక్రవర్తి పాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో జరిగిన విప్లవానికి లెనిన్ నాయకత్వం వహించారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పుల్లారెడ్డి, ఎం ఆంజనేయులు, అల్లూరి అరుణ్, బి సత్యనారాయణ, జి రఫాయేలు, కె రత్న కుమారి పాల్గొన్నారు.

నేడు పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం

ఉండి: యండగండిలోని పోలేరమ్మవారి ఆలయ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆధ్వర్యంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. అనంతరం ఆలయం వద్ద భక్తులకు అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ముస్లిం, మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి


ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలుపుతున్న మొహమ్మద్ సనావుల్లా

సాక్షి, భీమవరం: ముస్లిం, మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం డివిజన్ ఖాజీగా నియమితులైన మొహమ్మద్ సనావుల్లా శనివారం క్యాంపు కార్యాలయంలోఎమ్మెల్యే శ్రీనివాస్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన సందర్భంగా ఆయన మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లిం, మైనార్టీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారని అదే బాటలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం, మైనార్టీలు మరింత అభివృద్ధి చెందేవిధంగా కృషి చేస్తున్నారన్నారు. డివిజన్ ఖాజీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మొహమ్మద్ సనావుల్లా చిత్తశుద్ధితో పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు షానూర్, సంశుద్ధి కాన్, అహ్మద్, హలీఫ్, ఫిరోజ్ బాషా సైదులు పాల్గొన్నారు.

కేంద్రం విధానాలకు వ్యతిరేకంగా 26న నిరసన ర్యాలీ


కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా ట్రాక్టర్స్ ర్యాలీ పోస్టర్ ఆవిష్కరణ

సాక్షి, భీమవరం: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు అక్రమంగా తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలు రద్దు, విద్యుత్ చట్ట సవరణ బిల్లు ఉపసంహరించాలని, అన్ని పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫారసులు ప్రకారం మద్దతు ధరల చట్టం తేవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న నిర్వహించే ట్రాక్టర్స్ ర్యాలీని విజయవంతం చేయాలని అఖిలపక్ష రైతు సంఘాల నాయకులు కోరారు. భీమవరంలో శనివారం ట్రాక్టర్స్ ర్యాలీ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కార్యదర్శి ఆకుల హరే రామ్ అధ్యక్షతన భీమవరం సీఐటీయూ కార్యాలయంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ రైతాంగ సమస్యల పరిష్కారం కోసం అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రసారం నిర్వహించి రైతులను చైతన్యవంతం చేసి జనవరి 26న మండల, జిల్లాస్థాయిలో నిర్వహించే ట్రాక్టర్ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘాల నాయకులు లంకా కృష్ణమూర్తి, తమ్మినీడి నాగేశ్వరరావు,దండు శ్రీనివాసరాజు, జుత్తిగ నర్సింహమూర్తి, చింతకాయల బాబురావు, మామిడిశెట్టి రామాంజనేయులు, జక్కం శెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో కేసుల సత్వర పరిష్కారం


వెంపలో మాట్లాడుతున్న ప్యానల్ అడ్వకేట్ సునీల్‌కుమార్

భీమవరం అర్బన్: భ్రూణ హత్యలు, లింగ నిరణ పరీక్షలు చేసినా, చేసేందుకు ప్రయత్నించినా ల్యాబ్ నిర్వాహకులు, డాక్టర్లపై చట్టపరంగా కఠిన శిక్షలకు గురవుతారని ప్యానల్ అడ్వకేట్ బి సునీల్‌కుమార్ హెచ్చరించారు. భీమవరం మండలంలోని వెంప గ్రామంలోని సచివాలయంలో శనివారం ఫిబ్రవరి 11న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్న నేపథ్యంలో గ్రామస్తులకు న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్యానల్ అడ్వకేట్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న క్రిమినల్, సివిల్ కేసులు లోక్ అదాలత్‌లో కక్షిదారుల సమక్షంలో పరిష్కరించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎస్.రమేష్, ఎస్. సుధీర్, పీఎల్‌వీ కమల్ రాజు, సర్పంచ్ ఇంజేటి రాజేశ్వరి, కార్యదర్శి కృష్ణ మోహన్, వీఆర్వో ముత్యాలరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ హాస్టళ్లలో సమస్యలపై ఎస్‌ఎఫ్‌ఐ సర్వే


భీమవరంలో ఎస్ఎఫ్ఐ సమావేశంలో మాట్లాడుతున్న పెద్దిరాజు

సాక్షి, భీమవరం: ప్రభుత్వ హాస్టళ్లలోని సమస్యలపై ఈ నెల 23వ తేదీ నుంచి 5 రోజులపాటు ఎస్ఎఫ్ఐ సర్వే నిర్వహిస్తుందని జిల్లా కార్యదర్శి డి. పెద్దిరాజు చెప్పారు. శనివారం భీమవరంలో భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు పి వాసు అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ విద్యార్థి సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఎంతోకాలంగా పోరాటాలు చేస్తోందన్నారు. ఈనెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సదస్సులు నిర్వహిస్తామన్నారు. హాస్టళ్లలోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి టి ప్రసాద్, కమిటీ సభ్యులు వి భాను, ఎండీ జాన్, నాగేంద్ర, రవి పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు, ప్రాంతాలకు సమన్యాయం


ఆలమూరులో ముస్లిం ప్రార్థనా మందిర శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చెరుకువాడ

పెనుమంట్ర: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు, ప్రాంతాలకు సమన్యాయం చేస్తూ, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శనివారం ఆలమూరు గ్రామంలో రూ.50 లక్షలతో నిర్మించిన వివిధ అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో రోడ్లు, డ్రెయినేజీలు అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో వచ్చిన సమస్యలను తక్షణం పరిష్కరిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్‌లో రూ.15 లక్షలతో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫీడర్‌ను గ్రామంలో జీజీఎం నిధులు రూ. 20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రెయిన్‌లను, రూ. 25 లక్షలతో నిర్మించిన ముస్లిం ప్రార్థనా మందిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఏపీఈపీడీసీఎల్ న్యూ ఇయర్ క్యాలండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పెన్మెత్స విశ్వనాథరాజు, ఎంపీపీ కర్రి వెంకటనారాయణరెడ్డి(వాసు), జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి, సర్పంచ్ మేడపరెడ్డి వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యురాలు పలివెల ఆశాలత, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్‌మస్తాన్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ద్వారంపూడి నారాయణరెడ్డి, గొట్టుముక్కల సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

సీసీ రహదారుల నిర్మాణ పనుల పరిశీలన


జిన్నూరులో నిర్మాణ పనులు పరిశీలిస్తున్న సర్పంచ్

పోడూరు: జిన్నూరు గ్రామంలో సీసీ రహదారుల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. జెడ్పీనిధులు, గడపగడపకు మన ప్రభుత్వం నిధులు కలిపి దాదాపుగా కోటి రూపాయల వ్యయంతో గ్రామంలో పెదపేట, సూర్యాకాలనీ, ఆంజనేయనగర్, నర్సరాజునగర్ తదితర ప్రాంతాల్లో సీసీ రహదారులు నిర్మిస్తున్నారు. నిర్మాణ పనులకు జెడ్పీ చైర్మన్, నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ ఇటీవలే నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పెదపేటలో సీసీ రహదారుల నిర్మాణ పనులను శనివారం సర్పంచ్ జమ్ము బేబీ మహాలక్ష్మి పరిశీలించారు. గ్రామంలో సీసీ రహదారుల నిర్మాణానికి పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయడంపై సర్పంచ్ బేబీ మహాలక్ష్మి, సొసైటీ చైర్మన్ డీటీడీసీ బాబు, ఉపసర్పంచ్ దండు గోపాలకృష్ణంరాజు తదితరులు హర్షం వ్యక్తం చేస్తూ జెడ్పీ చైర్మన్ శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పనులు నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసేలా కృషి చేస్తున్నామని సర్పంచ్ బేబీ మహాలక్ష్మి తెలిపారు.

ఘనంగా రహదారి భద్రతా వారోత్సవాలు

పాలకొల్లు అర్బన్: వాహనాలను నిర్లక్ష్యంగా నడిపి ప్రమాదాలకు గురికావద్దని పాలకొల్లు ప్రాంతీయ రవాణాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం పాలకొల్లు ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయంలో రవాణా శాఖ ఉప కమిషనర్ టి.ఉమామహేశ్వరరావు ఆదేశాల మేరకు ఆటో డ్రైవర్లు, టాక్సీ డ్రైవర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణాలను సైతం కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అలాగే వాహనాలను ఎప్పటికప్పుడు కండిషన్‌లో ఉంచుకోవాలన్నారు. డ్రైవర్లు లైసెన్స్ విధిగా కలిగి ఉండాలన్నారు. రహదారి భద్రతపై ప్రభుత్వం ముద్రించిన కరపత్రాలను డ్రైవర్లకు పంపిణీ చేశారు.

పోలీసుల వినూత్న ప్రచారం

పెనుగొండ: శనివారం పెనుగొండ కళాశాల కూడలిలో సీఐ జీవీవీ ఆధ్వర్యంలో ఎస్సై రమేష్‌లు హెల్మెట్ ధరించి వాహనాలు నడుతున్న వారిని ఆపి చాక్లెట్‌లు పంపిణీ చేసి అభినందనలు తెలిపారు.

ప్రతి ఇంటికీ సంక్షేమం.. వసతుల కల్పనే లక్ష్యం

డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు


దుంపగడప గ్రామంలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఆకివీడు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంటికీ సంక్షేమం, ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు తెలిపారు. ఆకివీడు మండలం దుంపగడప గ్రామంలో మూడో రోజు శనివారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని పల్లెపాలెంలోని ప్రజలు గత కొన్నేళ్లుగా తమ వీధుల్లో రోడ్లు నిర్మించలేదని, డ్రెయినేజీల్లేవని, మంచినీటి సమస్య ఉందని, గ్రామంలో శివారు ప్రాంతంలో ఏటిగట్టున తమకు 20 ఏళ్ల క్రితం కాలనీ ఏర్పాటు చేశారని మహిళలు పీవీఎల్ దృష్టికి తీసుకొచ్చారు. కాలనీలో కనీస వసతులు లేవని, వర్షం వస్తే వీధులు మునిగిపోతున్నాయని తెలిపారు. సంక్షేమ పథకాలు సక్రమంగానే అందుతున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా పీవీఎల్ నిర్సంహరాజు సమాధానం చెబుతూ మెయిన్ పైప్‌లైన్ నిర్మాణానికి జల జీవన్ మిషన్‌లో నిధులు మంజూరయినట్టు చెప్పారు. త్వరలో మంచినీటి సమస్య పరిష్కరిస్తామన్నారు. వీధుల్లో రోడ్లు పంచాయతీ వేయాల్సి ఉందని, ఐనా గడప గడపకు మన ప్రభుత్వంలో మంజూరయిన నిధులు ఈ ప్రాంతానికి కేటాయించి సీసీ రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అర్హులందరికీ పథకాలను వర్తింపజేస్తామన్నారు. గత పాలకుల వల్ల ఏర్పాడిన సమస్యలను పరిష్కరించి పట్టాలు పొందిన పేదలందరికీ స్థలం కేటాయించి, ఇళ్ల నిర్మాణానికి సహకరిస్తామని చెప్పారు. పేదలందరూ అభివృద్ధిచెందాలనేదే సీఎం జగన్ లక్ష్యమని వివరించారు. పేదల చదువుకు సీఎం జగన్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా పలు పథకాలను పీవీఎల్ ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు (యండగండి శ్రీను), ఎంపీపీ కఠారి జయలక్ష్మి, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, వైస్ చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, పడాల శ్రీనివాసరెడ్డి, జి.ధనరాజు, ఎండీ.మదనీ, సిద్దిక్, అంబటి రమేష్, మోరా జ్యోతి, కేశిరెడ్డి దిలీప్, జి.సావిత్రి, ఎంపీటీసీలు పిన్నమరాజు సూర్యనారాయణరాజు, సొర్రా నాగబాబు, నాయకులు కొట్టు మాణిక్యాలరావు, అట్లూరి సంజయ్, కవిటం సుబ్రహ్మణ్యం, రామకృష్ణ, బందారు రాము, తమ్ము సత్యనారాయణ, వాటాల నాగరాజు, పండుబాబు, దుర్గారావు, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన


సినీ మ్యూజికల్ నైట్

భీమవరం(ప్రకాశం చౌక్): మావుళ్లమ్మ అమ్మవారి 59 వార్షికోత్సవ మహోత్సవాల్లో శనివారం ఏర్పాటు చేసిన పలు కళా ప్రదర్శనలు అకట్టుకున్నాయి. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు సాయిదేవి సంకీర్తన బృందం భీమవరం వారిచే భక్తిరంజని నాటకం నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు ఆమని నృత్య కళానిలయం ఆకివీడు వారిచే నిర్వహించిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. సాయంత్రం 6 గంటలకు స్వరతరంగిణి ఆర్కెస్ట్రా వారి సినీ మ్యూజికల్ నైట్ అలరించింది. రాత్రి శ్రీనివాసా చైతన్య కళా నాట్యమండలి గుంటూరు వారి వీరబ్రహ్మం గారి జీవిత చరిత్ర నాటకం ఆకట్టుకుంది. పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చి ఈకళా ప్రదర్శనలు తిలకించారు. ఈ కార్యక్రమంలో నీరుల్లికూరగాయ పండ్ల వర్తక సంఘం, అమ్మవారి ఉత్సవ కమిటీ సభ్యులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారి ఉత్సవాల్లో నేడు

మావుళ్లమ్మవారి 59 వార్షికోత్స ఉత్సవాల్లో ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు కోలాటం, 3 గంటలకు భజన, 4 గంటలకు అమ్మవారి సంకీర్తనలు, 5 గంటలకు కూచిపూడి నృత్యం, 7 గంటలకు స్త్రీలతో సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

24న ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన వాహనాల వేలం

సాక్షి, భీమవరం: ఎక్సైజ్ నేరాల్లో సీజ్ చేసిన వాహనాల జనవరి 24న భీమవరం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) స్టేషన్, ఆవరణలో వేలం వేయనున్నట్లు ఎస్ఈబీ సీఐ వి.వి.వి.ఎస్.ఎన్.వర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం 10 గంటలకు 13 ద్విచక్ర వాహనాలు, ఒక కారు బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనే వారు రూ. 5వేలు డిపాజిట్ చెల్లించాలని ఆధార్ కార్డు జెరాక్స్ వెంట తెచ్చుకోవాలన్నారు. పాటదారులు పాడుకున్న ధరకు అదనంగా 18 శాతం జీఎస్టీ చెల్లించాలని, పాట సొమ్మును అదేరోజు చలానా రూపంలో ప్రభుత్వానికి చెల్లించాలని వర్మ తెలిపారు.

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ


వీరవాసరం కళాశాలను పరిశీలిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

వీరవాసరం: వీరవాసరం ఎస్ఎంబీటీఏవీఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న కానిస్టేబుల్ రాత పరీక్షా కేంద్రాలను శనివారం ఎస్పీ యు.రవిప్రకాష్ సందర్శించారు. పరీక్ష ఏర్పాట్లపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో 240 మంది పరీక్ష రాయడానికి ఏర్పాట్లు సిద్ధం చేశామని అధికారులు వివరించారు. పరీక్షా కేంద్రం వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్త్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట సీఐ నాగప్రసాద్, ఎస్సై రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ దీక్షలు


భీమవరంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈనెల 23,24 తేదీల్లో రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, ఫిబ్రవరి 25న కలెక్టరేట్‌ల వద్ద నిర్వహించనున్న నిరసన దీక్షలు విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు కోరారు. శనివారం భీమవరంలో నిరసన దీక్షల వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు, భీమవరం మండల కార్యదర్శి ఎం సీతారాం ప్రసాద్, మల్లుల శ్రీనివాస్, ఆకలి రాము పాల్గొన్నారు.

జగనన్నకు కృతజ్ఞతలు


మేకా పార్వతి, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్

ఆకివీడు: బీసీల పట్ల అన్యోన్యతతో ఉంటూ, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన బీసీల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మేకా పార్వతి అన్నారు. కార్పొరేషన్ల పదవీ కాలాన్ని మరో రెండేళ్లు పొడిగిస్తూ జీఓ జారీ చేయడం పట్ల ఆమె శనివారం సీఎం జగన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీసీ మహిళగా తనకు గౌడ కార్పొరేషన్ డైరక్టర్ పదవి కేటాయించినందుకు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజుకు ధన్యవాదాలు చెప్పారు. నియోజకవర్గంలో బీసీలంతా వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారని ఆమె పేర్కొన్నారు.

కౌలు సొమ్ము అడిగిన భూయజమానిపై దాడి

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం కౌలు డబ్బులు అడిగితే అన్యాయంగా కొట్టి గాయపరిచాడని భూ యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం వీరవాసరం మండలం, నవుడూరు గ్రామానికి చెందిన చింగల్వ త్రిమూర్తులకు చెందిన కొమరాడలోని భూమిని నేదూరు పల్లయ్య శాస్త్రికి కౌలుకు ఇచ్చారు. త్రిమూర్తులు వెళ్లి కౌలు డబ్బులను పల్లయ్య శాస్త్రిని అడగగా అన్యాయంగా కొట్టి గాయపరిచాడని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.దీనిపై హెడ్ కానిస్టేబుల్ కె. వెంకటరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్ట్

ఆకివీడు: మండలంలోని గుమ్ములూరు గ్రామంలో పేకాడుతోన్న నలుగుర్ని అరెస్ట్ చేసి, రూ.7 వేలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై కె.రాజారెడ్డి శనివారం చెప్పారు. పేకాట, కోడి పందేలపై సమాచారం ఇవ్వాలని కోరారు.

కొట్లాటపై కేసు నమోదు

గుమ్ములూరు గ్రామంలో జాతర సందర్భంగా ఈ నెల 17వ తేదీ రాత్రి డాన్స్ కార్యక్రమంలో తనపై దాడి చేసినట్టు కోట పవన్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రాజారెడ్డి తెలిపారు. ఈ ఘటనలో కోట ఉమామహేష్, కోట మణికంఠలు ఇటుక రాయితో కొట్టగా తలకు బలమైన గాయం అయిందని ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు.